సాక్షి
ప్రకాశం
గురువారం । 17 । ఆగస్టు । 2023



ఐదేళ్ల బాలుడి దారుణ హత్య?

ఐదేళ్ల వయసున్న గుర్తుతెలియని బాలుడి మృతదేహాన్ని యర్రగొండపాలెం ఎన్‌హెచ్ గెస్ట్ రూం సమీపంలో గుర్తించారు. హత్య చేసి పడేసి ఉండొచ్చని భావిస్తున్నారు. - 8లో..



బీఎల్‌ఏలకూ భాగస్వామ్యం

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బీఎల్‌ఏలు కూడా భాగస్వాములు కావాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జిల్లా బాలబాలికల ఎంపిక



రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఒంగోలు: రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలబాలికల ఎంపిక స్థానిక నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూలులో బుధవారం నిర్వహించారు. ప్రకాశం జిల్లా చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఈ పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో విజేతలుగా బాలుర విభాగంలో ధమన్, దేవాన్ష్, షఫీజ్, అబ్దుల్ ముఖాత్, బాలికల విభాగంలో భువన, కృతి, రోషిని, హాసినిలు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈనెల 24 నుంచి 27 వరకు అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా కార్యదర్శి ఎస్‌కె అబ్దుల్ నబీ, టోర్నమెంట్ మేనేజర్ సుకంత్, సాయి తెలిపారు.

30 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు ప్రభుత్వంలోకి విలీనం

- నేడు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్

ఒంగోలు: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 30 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి గురువారం మధ్యాహ్నం 2 గంటలకు డీఈవో కార్యాలయంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆర్‌సీఎం ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్నవారితో పాటు చీరాల ఆదివాసీ ప్రైమరీ స్కూల్, హనుమంతునిపాడు మండలం ఈదరవారిపల్లి వీసీపీ ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులకు ఈ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. రాచర్ల, సీఎస్‌పురం, దొనకొండ, చీమకుర్తి, హనుమంతునిపాడు, కొమరోలు, కొనకనమిట్ల, కొత్తపట్నం, ఒంగోలు, టంగుటూరు, చినగంజాం, కారంచేడు మండలాల పరిధిలోని 29 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, ఒక గ్రేడ్ 2 హిందీ పండితులు ప్రభుత్వంలో విలీనం అయి కౌన్సెలింగ్‌లో నూతన స్థానాలకు బదిలీ కానున్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

ఒంగోలు: 2014 జూన్ 2వ తేదీకి కట్ ఆఫ్ డేట్ సవరించడంతో రాష్ట్రంలో 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం ఆనందంగా ఉందని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని ఏపీ పాలిటెక్నిక్ ఆల్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.సాయిరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2009-13 లో రెగ్యులర్ కాకుండా మిగిలిపోయిన 3451 మందిని కూడా రెగ్యులర్ చేశారన్నారు. కట్ ఆఫ్ డేట్ పెట్టడం వల్ల ఎవరైతే రెగ్యులర్ కాకుండా మిగిలిపోతున్నారో వారి సమస్యను కూడా అర్థం చేసుకుని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో 316 మంది పర్మినెంట్ ఉత్తర్వులు అందుకుంటారని పేర్కొన్నారు.

విద్యార్థి అదృశ్యం



కందుకూరు: స్కూల్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వచ్చిన విద్యార్థి కనిపించక పోయిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. విద్యార్థి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... పందలపాడు గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి కుమారుడు సాయినాథరెడ్డి పట్టణంలోని ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం స్కూల్‌కు వెళ్లటానికి గ్రామం నుంచి ఆటోలో వచ్చాడు. బుక్స్ కొనుక్కోవాలి అని చెప్పి పోస్టాఫీస్ సెంటర్‌లో ఆటో దిగాడు. ఆ తరువాత స్కూల్‌కి వెళ్లలేదు, తిరిగి ఇంటికి పోలేదు. దీంతో అప్పటి నుంచి తల్లిదండ్రులు, బంధువులు విద్యార్థి సాయినాథరెడ్డి ఆచూకీ కోసం గాలిస్తున్నా ప్రయోజనం లేదు. ఈ నేపథ్యంలో సమాచారం తెలిసిస్తే 9154590041, 9398253342 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యంగా భవిత



బ్రెయిలీ లిపిపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్ ఉపాధ్యాయుడు గోపాలుని సుబ్రహ్మణ్యం

శారీరక వైకల్యంతో బాధపడుతూ తోటిపిల్లలతో సమానంగా చదువుకోలేక తల్లడిల్లే చిన్నారుల బంగారు భవిత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు వారికి వరంగా మారాయి. దివ్యాంగ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారు త్వరగా కోలుకునేలా ఫిజియోథెరపిస్టులతో క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. దీంతో పాటు వారు సులువుగా చదువుకునేలా సహిత విద్యను అందించేందుకు రిసోర్స్‌పర్సన్లు, పిల్లల బాగోగులు చూసేందుకు ఆయాలు సేవలందిస్తున్నారు. పిల్లలు చదువుకునేందుకు ప్రత్యేకంగా ట్యాబ్‌లు ఇవ్వనున్నారు.

- దివ్యాంగులకు భవిత కేంద్రాల్లో అద్భుత సేవలు
- జిల్లాలో 38 భవిత కేంద్రాలు
- 61 మంది రిసోర్స్ పర్సన్‌లు
- 513 మంది దివ్యాంగ విద్యార్థులకు సేవలు
- 296 ట్యాబ్‌లు సిద్ధం

దర్శి: జిల్లాలో భవిత కేంద్రాలు దివ్యాంగులకు ఆదరువుగా నిలుస్తున్నాయి. దివ్యాంగుల విద్యార్థులకు సేవలందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఈ భవిత కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొన్ని సొంత భవనాలు, మరికొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రిసోర్స్ పర్సన్‌లు, ఆయాలు, ఫిజియోథెరపీ వైద్యుల పర్యవేక్షణలో ప్రభుత్వం ద్వారా అవసరమైన విద్యాబోధన చేస్తున్నారు. జిల్లాలో 38 భవిత కేంద్రాలు ఉండగా, 61 మంది రిసోర్స్ పర్సన్‌లు, 44 మంది స్కూల్ అసిస్టెంట్‌లు, 38 మంది ఆయాలు, 13 మంది ఫిజియోథెరపిస్టులు ఉన్నారు. జిల్లాలో 513 మందికి దివ్యాంగ విద్యార్థులకు వారు సేవలందిస్తున్నారు. 11 భవిత కేంద్రాలకు గాను ఏడు శాశ్వత భవనాలు ఉండగా నాలుగు వివిధ పాఠశాలల్లో నడుపుతున్నారు. 27 నాన్ భవిత కేంద్రాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక గదులు కేటాయించి విద్యను అందిస్తున్నారు. ప్రతి కేంద్రంలో సహిత విద్యను అందించేందుకు ఇద్దరు రిసోర్స్ పర్సన్‌లు, పిల్లల బాగోగులు చూసేందుకు ఒక ఆయా, ఫిజియోథెరపీ చేసేందుకు మూడు కేంద్రాలకు ఒక ఫిజియోథెరపిస్టు సేవలందిస్తున్నారు.



దర్శిలో భవిత కేంద్రం

గత ప్రభుత్వం దివ్యాంగులపై చిన్న చూపు:

గత ప్రభుత్వంలో దివ్యాంగుల పట్ల చిన్న చూపే చూశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగులకు నాణ్యమైన విద్యను అందించాలనే సదుద్దేశంతో రాష్ట్రంలో 4408 ట్యాబ్‌లు, జిల్లాలో 296 ట్యాబ్‌లు ఐదు నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు సహిత విద్యను అందించేందుకు సిద్ధం చేశారు. ట్యాబ్‌లు వస్తే వారికి మరింత నైపుణ్యం కలిగిన విద్య అందుతుంది.



ఆయా రంగాల్లో విద్యార్థులకు ఆటలపై శిక్షణ

దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు:

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భవిత కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి దివ్యాంగ విద్యార్థులకు కావాల్సిన ఉపకరణాలైన వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్‌లు నాణ్యమైన పరికరాలు అందించారు. అధికారంలోకి వచ్చిన తరువాత రెండేసి సార్లు అందించడమే కాక వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఫిజియోథెరపీ, బ్రెయిలీ, స్పీచ్ థెరపీ, మానసిక వికలాంగులకు ప్రత్యేక శిక్షణలు అందిస్తున్నారు.

దర్శి భవిత కేంద్రానికి దాతల సాయం:

భవిత కేంద్రాలకు దాతల సాయం కూడా అందుతోంది. దివ్యాంగులపై మమకారంతో దర్శిలోని భవిత కేంద్రంలో దాతల సాయంతో రైలింగ్, గ్రిల్స్, ప్రాంగణంలో చదును చేసి బండపరుపు వేయించారు. విద్యార్థులకు టీవీలు, కండరాల బలహీనత కలిగిన విద్యార్థుల వ్యాయామం కోసం ఫిజియోథెరపీ సైకిళ్లు అందజేశారు. దీనికి తోడు శాంసన్ రాఘవమ్మ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సాల్మన్‌జడ్సన్ గత సంవత్సరం నుంచి విద్యార్థులకు రాగిజావ, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. అంతే కాకుండా పుట్టిన రోజు ఫంక్షన్‌లు వంటి కార్యక్రమాలు కూడా దివ్యాంగుల మధ్యలో చేసుకుంటూ సంతృప్తి చెందుతున్నారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం:

భవిత కేంద్రంలో రిసోర్స్ పర్సన్ల సేవలు అభినందనీయం అని దివ్యాంగుల తల్లిదండ్రులు కొనియాడుతున్నారు. తీవ్ర వైకల్యం కలిగిన విద్యార్థులకు ఇంటి వద్దకు వచ్చి విద్యను అందిస్తున్నారు. ఫిజియోథెరపిస్టులు వారికి ఫిజియోథెరపీ సేవలు చేయడమే కాకుండా వారి కుటుంబ సభ్యులకు శిక్షణ కూడా ఇస్తున్నారు. మిగతా రోజుల్లో కుటుంబ సభ్యులు వారికి ఫిజియోథెరపీ చేసేలా అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు మెడికల్ సర్టిఫికెట్‌లు, పెన్షన్ మంజూరయ్యే వరకు రిసోర్స్ పర్సన్‌లు కృషి అభినందనీయమని తల్లిదండ్రులు కొనియాడుతున్నారు.

20 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా



సర్వ శిక్ష అభియాన్‌లో 20 ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో రిసోర్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాను. దివ్యాంగులకు విద్య నేర్పడంలో చాలా ఆనందం ఉంది. వారికి కావలసిన ఫిజియోథెరపీ చేయిస్తున్నాం. ఇక్కడికి రాలేని వారికి ఇంటివద్దే ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ మా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తారనే నమ్మకం మాకు ఉంది.

– గోపాలుని సుబ్రహ్మణ్యం, రిసోర్స్ పర్సన్

పిల్లలకు సేవ చేయడం ఆనందంగా ఉంది



దివ్యాంగ పిల్లలకు సేవ చేయడంలో ఎంతో ఆనందంగా ఉంది. మా కుమారుడు కూడా దివ్యాంగుడే. ఇదే స్కూల్లో చదువుతున్నాడు. మా అబ్బాయిని చూసుకుంటూ తోటి పిల్లలందరికీ ఇబ్బందులు లేకుండా చూస్తున్నాను. ఇక్కడ భవిత కేంద్రంలో ప్రభుత్వం కొన్ని సమకూర్చగా మరికొన్ని దాతలు ఇవ్వడంతో అన్ని రకాల సేవలు అందుతున్నాయి.

– బీ లీలావతి, ఆయా, దర్శి

ఓటర్ల సవరణలో నిబంధనలు ఉల్లంఘించరాదు

- బీఎల్వోలకు కలెక్టర్ సూచన



ఓటర్ల జాబితా సవరణలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

నాగులుప్పలపాడు: ఓటర్ల జాబితాలో కొత్తగా చేర్పులు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, ట్రాన్స్‌ఫర్ చేసేటప్పుడు నిబంధనలు ఉల్లంఘన జరగకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ సుజన్ కుమార్ ఎన్నికల సూపర్‌వైజర్లతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ తీరుపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ నాగులుప్పలపాడు మండలంలో సుమారు 3 వేల మంది ఓటర్లు చనిపోయారని, డెత్ సర్టిఫికెట్ లేదనే కారణంతో ఓటర్ల జాబితా నుంచి వీరి పేర్లను తొలగించకుండా ఉండరాదన్నారు. కుటుంబ సభ్యుల వాంగ్మూలం, స్థానిక ప్రజల సాక్ష్యం, పంచాయతీలో ఉన్న వివరాల ఆధారంగా వీరి పేర్లను తొలగించడానికి బీఎల్‌వోలు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దీని కోసం కుటుంబ సభ్యులకు తప్పకుండా ఫారం-7 నోటీసు ఇవ్వాలని సూచించారు. అదే విధంగా వివాహం చేసుకొని ఇతర ఊర్లకు వెళ్లిన ఆడపిల్లల ఓట్లను ప్రస్తుతం వారు ఉంటున్న పోలింగ్ కేంద్రం పరిధిలోకి బదిలీ చేయాలని అన్నారు. వివాహం చేసుకొని ఇక్కడకు వచ్చిన ఆడపిల్లల పేర్లను కూడా వారి తల్లిదండ్రులు ఉంటున్న గ్రామం నుంచి అత్త మామలతో ఉంటున్న గ్రామానికి బదిలీ చేయాలని చెప్పారు. ప్రజలు కూడా ఈ విషయంలో సహకరించడంతో పాటు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేస్తున్నప్పుడు రాజకీయ పార్టీల బీఎల్‌ఏలు కూడా వారితో పాటు ఉండాలన్నారు. ఇంటింటి సర్వే చేస్తున్న తీరులో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నట్లు కలెక్టర్ చెప్పారు. బీఎల్‌ఏ లకు తగిన శిక్షణ ఇవ్వడం ద్వారానే ఇది సాధ్యమైనట్లు తెలిపారు.

ఫెన్సింగ్ పోటీల్లో విజేతలకు అభినందన



రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన విజేతలను అభినందిస్తున్న రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి వి.నాగేశ్వరరావు

ఒంగోలు: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.నాగేశ్వరరావు అభినందించారు. ఒంగోలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ఆడిటోరియం ఆవరణలో జరిగిన 9వ రాష్ట్రస్థాయి అండర్ 20 జూనియర్ ఫెన్సింగ్ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ ద్వితీయ స్థానం కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు మరింతగా రాణించి జాతీయ స్థాయి పోటీల్లో ప్రకాశం కీర్తిని రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి జి.నవీన్, కోచ్‌లు ఆర్ఎస్ చిరంజీవి, ఆర్.విజయలక్ష్మి, డి.రాజులను ప్రత్యేకంగా ప్రశంసించారు.

రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు:

బాలురు: లోకేష్ సాయి, పుత్తూరి అంబరీష్, వైవీ విశ్వనాథ్ (ఫాయిల్ విభాగం-బ్రాంజ్ మెడల్), జి.మణితేజ్ చౌదరి, టి.అక్షయ్ త్రినాథ్, వి.పూజిత్ కుమార్ (ఈపీ విభాగం-సిల్వర్ మెడల్), పీవీ ఎన్ఎస్ వర్ధిష్ణు, ఎన్.వంశీప్రదీప్ మాధవ్, పి.చిన్న అయ్యపురెడ్డి (సైబర్ విభాగం-గోల్డ్ మెడల్)

బాలికలు: కె.తనూజ, జి.చైత్ర, కె.ప్రణీత (ఫాయిల్ విభాగం-సిల్వర్ మెడల్), ఎస్‌కె ఆసిఫా, బి.నమ్రత, హెచ్.శరణ్య సిరి (ఈపీ విభాగం, బంగారు పతకం).

బిల్లుల చెల్లింపులో సమస్యలు పరిష్కరించాలి



సివిల్ సప్లయిస్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: మిల్లింగ్, సార్టెక్స్‌కు సంబంధించి మిల్లర్లకు రావాల్సిన బిల్లుల చెల్లింపు ప్రక్రియలో ఏర్పడిన సాంకేతిక సమస్యలు త్వరగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ధాన్య కొనుగోలుకు సంబంధించి మిల్లింగ్‌లో పాల్గొనే రైస్ మిల్లర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లుల బకాయిలు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై సివిల్ సప్లయిస్ అధికారులు, మిల్లర్లతో ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. దీనిలో సివిల్ సప్లయిస్ డీఎం గ్లోరియా మిల్లింగ్, సార్టెక్స్‌లకు సంబంధించి 7 రకాల బిల్లులకు సంబంధించి రూ.13 కోట్లు రావాల్సి ఉండగా దానిలో రూ.7.5 కోట్లు ప్రభుత్వానికి బిల్లులు పంపామని తెలిపారు. మిగిలినవి కొన్ని సాంకేతిక కారణాలతో జాప్యం జరుగుతున్నట్లు వివరించారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా సమస్యలను త్వరగా పరిష్కరించి ప్రభుత్వానికి బిల్లులు పంపాలన్నారు. దీనిలో డీఎస్‌ఓ ఉదయభాస్కర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ సిబ్బంది గంగాధర్, అరుణ, విజయ్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

పశు కిసాన్ క్రెడిట్ కార్డుతో లబ్ధి



పోతవరం గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న జేడీ బేబిరాణి

నాగులుప్పలపాడు: పశు కిసాన్ క్రెడిట్ కార్డుతో రైతులు లబ్ధి పొందవచ్చని పశు సంవర్ధకశాఖ జిల్లా జేడీ డా.బేబిరాణి తెలిపారు. బుధవారం పోతవరం గ్రామంలో పశు విజ్ఞాన బడి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జేడీ బేబిరాణి రైతులకు పశు సంవర్ధకశాఖ నుంచి అమలవుతున్న పలు పథకాలపై అవగాహన కల్పించారు. కిసాన్ క్రెడిట్ కార్డు, దాణామృతం వలన రైతులకు కలిగే ప్రయోజనాలపై వివరించారు. అలాగే సరైన సమయంలో పశువులకు టీకాలు వేయించాలన్నారు. తెల్ల పశువులలో ముద్ద చర్మ వ్యాధి, 4 నుంచి 8 నెలల పడ్డ దూడలకు బ్రూసెల్లస్ టీకాలు గొంతువాపు టీకాలపై అవగాహన కల్పించారు. అనంతరం కండ్లగుంట రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పశు సహాయకులు లావణ్య, రంగనాథ్, రైతులు పాల్గొన్నారు.







వింటేజ్ లుక్ అదుర్స్

వింటేజ్ లుక్‌తో ఆకట్టుకుంటున్న ఈ కారు ఒంగోలు నగర వీధుల్లో చక్కర్లు కొడుతోంది. ఆర్ఆర్ఆర్ సినిమాలో ఉపయోగించిన 1852 రోల్స్ రాయిస్ మోడల్ కారుకు ముగ్ధుడైన ఒంగోలుకు చెందిన పద్మాలయ అశోక్ అనే యువకుడు సుమారు రూ.12 లక్షలు వెచ్చించి హిమాచల్‌ప్రదేశ్‌లో ఇంజన్ కొనుగోలు చేసి సింగపూర్‌లో బాడీ కట్టించి నగరంలో తిప్పుతూ ముచ్చట తీర్చుకున్నాడు.

- సాక్షి, ఒంగోలు

ఆరోగ్య భాగ్యంతో రాయితీపై వైద్య సేవలు

- ఆస్టర్ రమేష్ హాస్పిటల్ నిర్వాహకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆయిస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్యులు, నిర్వాహకులు

ఒంగోలు అర్బన్: ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో ఇన్ పేషెంట్‌లు, అవుట్ పేషెంట్లకు 'ఆరోగ్యభాగ్యం' కార్యక్రమం ద్వారా 25 శాతం రాయితీతో వైద్య సేవలు అందించేందుకు నిర్ణయించామని హాస్పిటల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, సీఈఓ దేవానంద్ తెలిపారు. బుధవారం హాస్పిటల్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. 35 సంవత్సరాలు వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించామని, ఈ నేపథ్యంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువ చేయాలని ఆరోగ్యభాగ్యం పేరుతో వైద్య పరీక్షలు, వైద్య సేవలపై 25 శాతం రాయితీతో పాటు మందులపై కూడా 15 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యభాగ్యం కార్డులు తీసుకుని రాయితీ వైద్య సేవలు పొందాలని కోరారు. దీనిలో సీవోవో హరికుమార్ రెడ్డి, మెడికల్ డైరెక్టర్ వంశీ, దీప తదితరులు పాల్గొని 'ఆరోగ్యభాగ్యం' కార్డును ఆవిష్కరించారు.

క్లుప్తంగా

వెదురుబొంగుల లారీ స్వాధీనం



పట్టుబడిన వెదురు బొంగుల లారీ

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట అభయారణ్యం అటవీ ప్రాంతంలో అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న వెదురు బొంగుల లారీని అటవీశాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వెదురు బొంగుల వేలంపాట జరగకపోయినా అనుమతులు లేకుండా ఓ కాంట్రాక్టర్ తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు లారీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

టిమ్ మెషీన్ చోరీ

మార్కాపురం: ఆర్టీసీ బస్సులో టిమ్ మెషీన్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించిన సంఘటన బుధవారం మార్కాపురం ఆర్టీసీ డిపోలో చోటుచేసుకుంది. వివరాలు.. ఒంగోలు నుంచి మార్కాపురం వచ్చిన ఆర్టీసీ డ్రైవర్ రాములు భోజనానికి వెళ్తూ లగేజీ బ్యాగు, టిమ్ మెషీన్‌ను బస్సులోనే ఉంచారు. ఆయన తిరిగొచ్చే సరికి బస్సులో బ్యాగ్, టిమ్ మెషీన్‌ను గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో విషయాన్ని డిపో మేనేజర్ నరసింహులుకు తెలియజేయడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా బ్యాగు, టిమ్ మెషీన్‌ను స్థానిక చర్చి వద్ద దొంగ పడేసి వెళ్లినట్లు డిపో మేనేజర్ తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణలో బీఎల్‌ఏలకూ భాగస్వామ్యం

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బీఎల్‌ఏలు భాగస్వాములు కావాలని, అందుకు అన్ని గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న తీరును రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. సర్వే నిర్వహిస్తున్న బీఎల్‌ఓల వెంట కొన్నిచోట్ల బీఎల్‌ఏలు ఉండటం లేదన్నారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి లోపాలు లేకుండా రూపొందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొన్ని చోట్ల డోర్ నంబర్ కేటాయింపు ప్రక్రియ పూర్తి కాలేదని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సొంత ఇళ్లు ఉండి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు రెండు చోట్ల ఓటరుగా ఉంటున్నారని, అద్దె ఇళ్లను ఖాళీ చేసిన వారికి, ఆ ఇంట్లో కొత్తగా చేరిన వారికి ఒకటే డోర్ నంబర్‌తో ఓట్లు ఉంటున్నాయన్నారు. ఇటువంటి కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీలత, ట్రైనీ ఐఏఎస్ శౌర్య పటేల్, ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, ఈఆర్‌ఓలు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, రాజశేఖర్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఐదేళ్ల బాలుడి దారుణ హత్య?

యర్రగొండపాలెం: యర్రగొండపాలెంలోని మార్కాపురం రోడ్డులోని ఎన్‌హెచ్ రెస్ట్ రూం సమీపంలో గుర్తుతెలియని బాలుడి మృతదేహం ఉన్నట్లు బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. సుమారు ఐదేళ్ల వయసు ఉన్న ఈ బాలుడిని రెండు రోజుల క్రితం హత్యచేసి చెట్లల్లో పడేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా పెద్దదోర్నాల మండలంలోని పెద్దమంతనాల చెంచుగూడేనికి చెందిన పోతన్న తన భార్య, కుమార్తె, కుమారుడు కనిపించకుండా పోయారని ఈ నెల 14వ తేదీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత నెల 28వ తేదీ వీరు పెద్దమంతనాల నుంచి యర్రగొండపాలెం మండలంలోని గాంధీ నగర్‌లో జరుగుతున్న పీర్ల పండుగ కోసం వెళ్లారని, అక్కడి నుంచి వారు కనిపించకుండా ఎటోవెళ్లారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కనిపించకుండా పోయిన వారిలో బాలుడి శవం అయి ఉండవచ్చని పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. తల్లి, కుమార్తె ఆచూకీ కోసం గాలిస్తున్నారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో బాలుడిని హత్యచేసి అక్కడ పడేసి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్లూస్ టీంను పిలిపించి దర్యాప్తు ముమ్మరం చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి పరిశీలించారు. సీఐ కె.మారుతీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై జి.కోటయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బాలుడి మృతదేహం

పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పాలన



చెన్నంపల్లిలో లబ్ధిదారులకు పథకాల లబ్ధి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్



గన్నవరంలో ఎమ్మెల్యే బుర్రాను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ దంపతులు

● ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

వెలిగండ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎమ్మెల్యే, ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని గన్నవరం గ్రామ సచివాలయ పరిధిలోని చెన్నంపల్లెలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అందిన సంక్షేమ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిదారునికి వచ్చిన మొత్తం పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను వారికి అందజేశారు. ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో నివేశనా స్థలం మంజూరుచేసి కాలనీలు కూడా మంజూరుచేసి సొంతింటి కలను సాకారం చేస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలో ఇప్పటివరకు 1400 నివేశనా స్థల పట్టాలు మంజూరుచేసి పట్టాలు ఇచ్చామని, త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తిచేస్తే బిల్లులు లబ్ధిదారులకు చెల్లిస్తామన్నారు. రేషన్‌కార్డుకోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్నారు. రేషన్‌కార్డులు వచ్చిన వెంటనే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకం

అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే బుర్రా అన్నారు. వైఎస్సార్ అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీవిద్యా పథకాలతో పేదల విద్యకు బాసటగా నిలిచిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. అదేవిధంగా వైఎస్సార్ ఆసరా, ఈబీసీనేస్తం, వైఎస్సార్ చేయూత, సున్నావడ్డీ పథకాలతో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎంతో తోడ్పాటునందిస్తోందని లబ్ధిదారులకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు తోడుగా నిలవాలన్నారు. గడప గడపకూ గన్నవరం, చెన్నంపల్లి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బుర్రాకు, ఎంపీపీ, నాయకులకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జార్జి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ తాతపూడి దేవసహాయం, వైస్ ఎంపీపీ మేరిపుష్పలు ఎమ్మెల్యే, నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామన మహాలక్ష్మి, ఎంపీడీఓ టి.సుకుమార్, ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కే.పద్మావతి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ టి.మేరిపుష్ప, గన్నవరం సర్పంచ్ మల్లెబోయిన నారాయణమ్మ, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, పార్టీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రమణ్యం, వెలిగండ్ల సర్పంచ్ టి.సురేష్‌బాబు, మోటుపల్లి ఎంపీటీసీ వెంకటగురవయ్య, పార్టీ నాయకులు వై.నాగూర్‌యాదవ్, గంజి రవీంద్ర, ఎలికా నారాయణ, తిరుపతయ్య, ఎలికా రమణయ్య, టి.నాని, కే.వెంకట్రామయ్య, బొబ్బా వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి



సురేష్ మృతదేహం



రమాదేవి మృతదేహం

కురిచేడు: విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పడమర వీరాయపాలెంలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పడమర వీరాయపాలెం గ్రామానికి చెందిన ఏనుగంటి సురేష్(38) పొలం పనులతో పాటు విద్యుత్ మరమ్మతులు చేస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పడమర వీరాయపాలెం గ్రామానికి చెందిన ఊట్ల వెంకటరావు తన పొలంలోని విద్యుత్‌మోటారు మరమ్మతులు చేసేందుకు తీసుకువెళ్లాడు. మోటార్ మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. వెంటనే వెంకట్రావు కురిచేడులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా..అక్కడ వైద్యులు పరీక్షించి సురేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య ఆదినారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం దేవకుమార్ తెలిపారు. దర్శి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య ఆదినారాయణమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు.

పొలంలో గడ్డి కోస్తూ..

దర్శి: పొలంలో గడ్డి కోస్తుండగా విద్యుత్ తీగ కొడవలికి తగిలి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని బొట్లపాలెం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు.. రమాదేవి తమ మాగాణిని వరి నాట్లకు సిద్ధం చేసుకుంటున్నారు. గట్లపై ఉన్న గడ్డి కోస్తుండగా మోటారు వైరు తెగి కొడవలికి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. పక్క పొలాల రైతులు చూసి మృతురాలి భర్త వెంకటేశ్వర్లుకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్‌లోని పలువురు ఎస్సైలకు సీఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్‌ఐ పేరు	విభాగం	జిల్లా/యూనిట్
ఎ.భాస్కర్	డీఎస్‌బీ	పల్నాడు
ఎస్.వెంకటేశ్వరరావు	నరసరావుపేట వన్‌టౌన్ పీఎస్	పల్నాడు
పోలూరి శ్రీనివాసరావు	రైల్వేస్	రైల్వేస్
ఎస్.నాగూర్ మీరా సాహెబ్	దిశ పీఎస్	గుంటూరు
జె.అనురాధ	అరండల్‌పేట పీఎస్	గుంటూరు
ఇ.నారాయణ	లాలాపేట పీఎస్	గుంటూరు
కె.అజయ్‌కుమార్	దిశ పీఎస్	ప్రకాశం
కుమ్మరి శ్రీనివాసరావు	నల్లపాడు పీఎస్	గుంటూరు
జి.వెంకట నారాయణ	పీటీసీ	పీటీసీ ఒంగోలు
డి.వెంకటేశ్వరరావు	కోవూరు పీఎస్	ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా
సీహెచ్.రాంబాబు	ఇంటెలిజెన్స్	ఇంటెలిజెన్స్
కె.మల్లికార్జున	పాదిలి పీఎస్	ప్రకాశం జిల్లా
మేడా శ్రీనివాసరావు	ఎస్‌సిఆర్‌బి, సీఐడీ	సీఐడీ
ఆవుల వెంకటేశ్వర్లు	లింగసముద్రం పీఎస్	ఎస్‌పీఆర్ నెల్లూరు జిల్లా
సిహెచ్.ఐ.ఎస్.శ్రీనివాసరావు	రైల్వేస్	రైల్వేస్
బి.సుబ్బనాయుడు	అరండల్‌పేట పీఎస్	గుంటూరు

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

తర్లుపాడు: మండలంలోని మేకలవారిపల్లి టోల్‌ప్లాజాలో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న తుంపాల నాగరాజు(20) ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం వేకువజామున వెలుగుచూసింది. తర్లుపాడు పోలీసుల కథనం మేరకు విజయవాడ సమీపంలోని ఎ.కొండూరు మండలం గోపాలపురం గ్రామానికి చెందిన తుంపాల నాగరాజు గత 8 నెలలుగా రోడ్ మెయింటెనెన్స్ క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ మేకలవారిపల్లి టోల్‌ప్లాజాలో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి పది గంటల సమయంలో భోజనం చేసి తన గదిలోకి వెళ్లినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయింది. ఉదయం నాగరాజు గది తలుపు తెరవకపోవడంతో తన తోటి సిబ్బంది వెనుకవైపు కిటికీలో నుంచి గదిలోకి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై వి.సుధాకర్ పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నాగరాజుతో రాత్రి 9 గంటల సమయంలో ఫోన్‌లో మాట్లాడినట్లు తల్లి శివపార్వతి తెలిపారు. ఉదయాన్నే తన కుమారుడు చనిపోయినట్లు విషయం తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపించింది.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుధాకర్

ఒంటరితనం తాళలేక బలవన్మరణం

● నిద్రమాత్రలు మింగిన యువతి
● చికిత్స పొందుతూ వైద్యశాలలో మృతి



అనసూర్య(ఫైల్)

మద్దిపాడు: చిన్నతనంలోనే తండ్రి దూరమయ్యాడు. తోడబుట్టిన ఇద్దరక్కలు కానరాని లోకానికి పోయారు. కట్టుకున్నోడు వదిలేశాడు. తల్లి అనారోగ్యానికి గురై రెండు నెలల క్రితం చనిపోయింది. ఈ నేపథ్యంలో ఒంటరితనాన్ని జీర్ణించుకోలేని ఆ యువతి మాత్రలు మింగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాద సంఘటన మండల కేంద్రమైన మద్దిపూడిలో చోటుచేసుకోగా.. బుధవారం యువతి అంత్యక్రియలు నిర్వహించారు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మండల కేంద్రమైన మద్దిపూడి వడ్డెర కాలనీకి చెందిన ఉప్పు తిరుపతయ్య, సాంబ దంపతులకు ముగ్గురు సంతానం. ముగ్గురు ఆడపిల్లల్లో ఇద్దరక్కలు 12 ఏళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. అనారోగ్యంతో ఉన్న తల్లి సాంబాను చిన్న కూతురైన అనసూర్య (32) కూలిపని చేస్తూ పోషిస్తోంది. అనసూర్యను 13 ఏళ్ల క్రితం మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. పెళ్లి అయిన ఏడాదికే భర్త వదిలి వేయడంతో అనసూర్య తల్లి వద్దనే ఉంటుంది. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి సాంబ రెండు నెలల క్రితం మరణించింది. పసితనం నుంచే తండ్రి ప్రేమకు నోచుకోని అనసూర్యకు తోడున్న తల్లి సైతం దూరమైంది. తోడబుట్టినవారూ లేరు. కట్టుకున్నోడు సైతం వదిలేశాడు. ఈ నేపథ్యంలో 'నేను ఎందుకు బతకాలి? ఎవరికోసం బతకాలి?' అని ఒంటరిగా ఉన్న అనసూర్య మదనపడింది. ధైర్యం చెప్పేవారు, నా అన్నవారు లేరని బాధపడుతూ, ఒంటరితనాన్ని జీర్ణించుకోలేకపోయింది. ఈ క్రమంలో అనసూర్య 15 రోజుల క్రితం నిద్రమాత్రలు మింగింది. బంధువులు గమనించి వైద్యశాలలో చేర్పించి చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న అనసూర్య ఆదివారం రాత్రి రెండోసారి గ్లాసు నీటిలో అధికమొత్తంలో మాత్రలు కలుపుకుని తాగింది. తెల్లవారినా బయటకు రాకపోవడంతో బంధువులు గడ్డపారతో తలుపులు పగలగొట్టి చూశారు. నోటి వెంట నురుగు కారుతూ నేలపై అచేతనంగా పడిఉన్న అనసూర్యను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అనసూర్య చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుధవారం మద్రిపూడిలో ఖననం చేశారు. ఉప్పు వెంకటరాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ముండ్లమూరు: మండలంలోని పోలవరంలో ఈ నెల 14న జరిగిన హత్య కేసులో నిందితుడు కుంచాల వెంకటేశ్వర్లును బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై యువీ కృష్ణయ్య తెలిపారు. పోలవరంలో కుంచాల సుబ్బారావును తండ్రి వెంకటేశ్వర్లు ఈ నెల 14న గొడ్డలితో నరికి హత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు వెంకటేశ్వర్లును పోలవరం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం అదుపులోనికి తీసుకున్నారు. అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. మృతుడు సుబ్బారావు తనని, తన భార్యని చంపుతానని బెదిరించడంతో భయపడి హత్య చేసినట్లు వెంకటేశ్వర్లు ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితున్ని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో నిందితున్ని పట్టుకోవడంతో దర్శి సీఐ రామకోటయ్యను, ఎస్ఐ కృష్ణయ్యని ఎస్పీ మల్లికాగర్గ్ అభినందించారు.

గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు

ఒంగోలు: గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు అన్నారు. స్థానిక పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల విద్యను అభ్యసించే విద్యార్థినులు లైంగిక దోపిడీకి గురికాకుండా ఉండాలంటే అవగాహన కలిగి ఉండాలన్నారు. కౌమార దశలో ఉన్న బాలికలు సామాజిక మాధ్యమాలకు వీలైనంత దూరంగా ఉండటం వల్లే అనేక రకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. బంధుత్వం, స్నేహం ముసుగులో బాలికలు లైంగిక దోపిడీకి గురవుతున్నారని, అటువంటి వారి పట్ల జాగ్రత్త వహించాలన్నారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ వి.గౌతమి మాట్లాడుతూ పోలీసుశాఖ ద్వారా వివిధ పాఠశాలల్లో గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అనే అంశంపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా బాలల సంక్షేమ అధికారి దినేష్ మాట్లాడుతూ బాలికలను ప్రేమ పేరుతో వంచించడం దుర్బుద్ధితో తాకడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, సఖి వన్‌స్టాప్ సెంటర్ న్యాయవాది ఆర్.స్పందన, పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పలువురు న్యాయమూర్తితో మాట్లాడుతూ స్థానిక వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహం చుట్టూ పలువురు యువకులు మద్యం సేవిస్తూ ఇబ్బంది పెడుతున్నట్లు వివరించారు. దీంతో తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖకు సూచించారు. అనంతరం వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు.

నారాయణస్వామి దేవస్థాన ఈఓగా రమణారెడ్డి

సీఎస్‌పురం (పామూరు): మిట్టపాలెం నారాయణ స్వామి దేవస్థానం ఈఓగా జి.రమణారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈతముక్కల గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తున్న రమణారెడ్డిని పూర్తిస్థాయి (ఎఫ్‌ఏసీ) ఈఓగా మిట్టపాలెం గ్రూపుదేవస్థానాలైన మిట్టపాలెం నారాయణస్వామి, పామూరు శ్రీమదనవేణుగోపాల స్వామి, వల్లీసమేత భుజంగేశ్వరస్వామి దేవస్థానాల ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానాల అభివృద్ధికి పాలకమండలిసభ్యులతో కలిసి పనిచేస్తామన్నారు. ఆయన వెంట భైరవకోన దేవస్థాన ఈఓ నర్రా నారాయణరెడ్డి, మిట్టపాలెం ఆలయ కమిటీ సభ్యులు మంచికంటి మధు, పాలపర్తి నారాయణరావు, లక్ష్మయ్య, ముదుమాల నారాయణరెడ్డి ఉన్నారు.



ఈఓగా బాధ్యతలు చేపడుతున్న జి.రమణారెడ్డి